క్లుప్తంగా

యోగాంధ్ర క్విజ్ పోటీలు



కోటనందూరులో యోగాపై వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న యువత

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ వెంకటనారాయణ పర్యవేక్షణలో సోమవారం యోగాపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. యోగాంధ్ర యాప్‌లో రిజిస్టర్ చేసుకున్న మండల వ్యాప్త యువతీ యువకులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి ఎంపీడీఓ బహుమతులు అందజేశారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.జయరాం, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రసాలతో అభిషేకం



అరుణాచలేశ్వర స్వామి వారికి మామిడి రసాలతో అభిషేకం నిర్వహిస్తున్న పండితులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసియున్న అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారికి సోమవారం 1,313 రకాల మామిడి రసాలతో సోమవారం అభిషేకం నిర్వహించారు. పండితులు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తోట రాంజీ పరామర్శ



రామవరంలో వైఎస్సార్ సీపీ నేత వీరబాబును పరామర్శిస్తున్న రాంజీ

జగ్గంపేట: జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత లింగంశెట్టి వీరబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ మేరకు సోమవారం ఆయన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ పరామర్శించారు. ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీ నారాయణ స్వామి ప్రతిష్ఠకు ముహూర్తం

కిర్లంపూడి: చిల్లంగిలో వేంచేసియున్న అష్ట సమేత లక్ష్మీనారాయణ స్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం యాగశాల, పందిరి వేసేందుకు రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆఖరి రోజు హరిహరుల కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రతిష్ఠోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గంజాయి వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందుతుడు పాండ్యన్

తుని: విశాఖ ఏజెన్సీ నుంచి తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. సోమవారం అందిన సమాచారం మేరకు తుని రైల్వేస్టేషన్ సమీపంలోని నర్సీపట్నం బస్టాండ్‌లో అనుమానస్పదంగా కనిపించిన తమిళనాడుకు చెందిన పాండ్యన్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు అతడిని తనిఖీ చేయగా బ్యాగులో ఉన్న ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. నిందుతుడిని తుని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

ప్రగతిలో శిక్షణ శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సోమవారం తెలిపారు. క్యాంప్ కమాండెంట్, గ్రూప్ కెప్టెన్ పి.ప్రవీణ్ బాబు మాట్లాడుతు పొగాకు వ్యతిరేక దినోత్సవం, రక్తదాన శిబిరం, పర్యావరణ, కాలుష్య నివారణపై అవగాహన, ప్రథమ చికిత్స, డ్రోన్ ఫ్లైయింగ్ డెమో వంటి వివిధ కార్యక్రమాలు ఈ శిక్షణా శిబిరంలో నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ శిబిరం యువ క్యాడెట్లలో సేవా స్ఫూర్తిని, సామాజిక బాధ్యతను హైలైట్ చేస్తుందని, ఇది దేశ నిర్మాణం పట్ల ఎన్‌సీసీ అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని ఈ నెల 7 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

డబ్బులిచ్చి రోగాలు కొనుగోలు

- పండ్ల పక్వానికి రసాయనాల వాడకం
- రోగాల పాలవుతున్న కొనుగోలుదారులు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల చోద్యం

ఏలేశ్వరం: పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు వ్యాపారులు రసాయనాలు విరివిగా వాడుతుండటంతో కొనుగోలుదారులు రోగాలు పాలవుతున్నారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చిరికలు జారీచేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు కానరావడం లేదు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్న సంబంధిత అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రివాజు ప్రకారం అరటి, మామిడి, బొప్పాయి తదితర పండ్లు పరిపక్వానికి వచ్చేవరకు కావువేసి పండిన తరువాత కొనుగోలు చేసేవారు. అయితే మారుతున్న కాలాన్ని బట్టి వ్యాపారులు పెట్టిన పెట్టుబడి వెంటనే చేతికి వచ్చేందుకు పండ్లకు కార్బయిడ్ రసాయనం వాడి త్వరగా పరిపక్వానికి వచ్చేలా చేస్తున్నారు. దీంతో ఈ పండ్లను తిన్న కొనుగోలుదారులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. నియోజకవర్గంలో మామిడి 2,579 హెక్టార్లు, అరటి 2,359 హెక్టార్లల్లో పండిస్తున్నారు. వీటితో పాటు అక్కడక్కడ బొప్పాయి తోటలు పండిస్తున్నారు. అయితే అరటి, మామిడి పండ్లను సుదూర ప్రాంతాలకు తరలిస్తుంటారు. నియోజకవర్గంలోని యర్రవరం అరటి మార్కెట్‌లో అరటిపండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు, రోజువారీ వ్యాపారం నిమిత్తం అరటిగెలలు అమ్మేందుకు వ్యాపారులు రసాయనాన్ని వినియోగిస్తున్నారు. అలాగే బొప్పాయి, మామిడి పండ్లకు రసాయనాలను వాడుతున్నారు. ఇవి తిన్నవారికి అనారోగ్యం వచ్చే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.



మార్కెట్‌లో పండ్లు



మామిడిపళ్లు

మామిడి పండ్లకు డిమాండ్

ప్రస్తుతం వేసవికాలం కావడంతో మామిడిపళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. కాపు తక్కువగా ఉండటంతో మామిడిపళ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. పరక(14పళ్లు) రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతున్నాయి. కాగా ఇటీవల ఈదురు గాలులకు రాలిపోయిన కాయలకు రసాయానాలతో పక్వానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వ్యాధుల ప్రబలే అవకాశం

పండ్లకు రసాయనాలను వాడితే క్యాన్సర్‌తో పాటు పలురకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరిస్తున్నారు. దీనిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వారు కోతున్నారు. కాగా దుకాణాల వద్ద వ్యాపారులు బహిరంగంగా రసాయనాలు వాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి వ్యాపారులకు అవగాహన కల్పిస్తే వారిలో మార్పు వస్తుందని ప్రజలు చెబుతున్నారు.



విక్రయిస్తున్న ద్రాక్ష పళ్లు

అధికారులు చర్యలు తీసుకోవాలి



పండ్ల పక్వానికి రసాయానాల వాడకంపై అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇటువంటి పండ్లతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు, గర్భిణులు ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– చందక కిరణ్‌బాబు, ఏలేశ్వరం

సేవలతోనే గుర్తింపు సాధ్యం



ఏలేశ్వరంలో తాతయ్యను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఏలేశ్వరం: ప్రభుత్వ ఉద్యోగులు తమసేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందాలని వైఎస్సార్ సీపీ నేత మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం ఇరిగేషన్ శాఖలో పనిచేసిన దంగేటి తాతయ్య పదవి విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ తాతయ్య ఇరిగేషన్ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేశారన్నారు. ఆయన సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నిజాయితీ వారి పదవి విరమణ అనంతరం గుర్తింపు తెస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసీ డైరక్టర్ పైల విజయ్‌కుమార్, సామంతుల చిన్నారావు, అరవాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు

తుని రూరల్: తుని రూరల్ మండలంలో అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిరోజు తొమ్మిది మంది ఇన్‌స్ట్రక్టర్లు యోగాపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని అన్ని సచివాలయాల పరిధిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరసనకు వైఎస్సార్ సీపీ..సై

తుని రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల నాలుగున తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. తుని మండలం ఎస్.అన్నవరం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వంలో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమానికి అవసరమైన జెండాలు, ప్లకార్డులు, ఇతర సామాగ్రిని సిద్ధం చేస్తున్నారు. నాలుగో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు తుని పట్టణంలో ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ఈ నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుంది. మొయిన్ రోడ్డు, అల్లూరి సీతారామరాజు సెంటర్ మీదుగా రెవెన్యూ కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలు చేరుకుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక అరాచక పాలన, ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంపై ఇప్పటికే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నారు. నియోజకవర్గంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై తుని పట్టణం, రూరల్, కోటనందూరు, తొండంగి మండలాల నాయకులతో జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారు.



తునిలో వెన్నుపోటు దినం నిరసనకు ఏర్పాట్లు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

రౌతులపూడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించి మోసం చేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ నెల నాలుగున ప్రత్తిపాడులో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సత్యనారాయణ సోమవారం పిలుపునిచ్చారు. కూటమి సంవత్సరం మోసపూరిత పాలనపై ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాలతో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం రౌతులపూడిలో పార్టీ శ్రేణులతో కలసి వెన్నుపోటు దినం ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి తిరుములరాయల్ సాయి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ సంస్థాగత ప్రతినిధులు పాల్గొన్నారు.

శంఖవరం: వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను అన్నారు. జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను సోమవారం కత్తిపూడిలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, అధినేత, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలైందన్నారు. వెన్నుపోటు పొడవడంలో ఆయనకు ఎవరూ సాటిలేరని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలనే ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ నెల 4న ప్రత్తిపాడులో నియోజక వర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శెట్టి బత్తుల కుమార్ రాజా, గుర్రాజు,ఎంపీటీసీలు సత్యప్రసాద్, చొప్పారాం బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో వెన్నుపోటు దినం ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు



కత్తిపూడిలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రజలను వెన్నుపోటు పొడిచారు

తుని: ఎన్నికల సమయంలో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు అన్నవరం శ్రీను అన్నారు. సోమవారం తుని మండలం ఎస్.అన్నవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినోత్సవం పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పిల్లను ఇచ్చిన మామ ఎన్టీఆర్‌ను వెన్నుపొడిచారని, ఇప్పుడు అధికారం ఇచ్చిన ప్రజలను మరోసారి వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వారికి జరిగిన అన్యాయంపై వైఎస్సార్ సీపీ చేస్తోన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరు కావాలని వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి రేలంగి రమణాగౌడ్ అన్నారు. కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



వెన్నుపోటు దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ తుని పట్టణ నాయకులు

వెన్నుపోటులో బాబు స్పెషలిస్టు

నాడు మామగారిని, నేడు రాష్ట్ర ప్రజలను

జగ్గంపేట: రాష్ట్రంలో నాడు మామగారిని,నే డు ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. బాబు వెన్నుపోట్లు పొడవడంలో స్పెషలిస్టు అని మరోసారి రుజువు అయిందని దుయ్యబట్టారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో కిర్లంపూడి మండల పార్టీ నేతలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూన్ 4వ తేదిన కూటమి ప్రభుత్వం పాలనకు నిరశనగా వైఎస్సార్ సీపీ చేపట్టే వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదని జగ్గంపేటలో చేపట్టే వెన్నపోటు దినం నిరశన కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు విచ్చేసి నిరసనను విజయవంతం చేయాలన్నారు. వెన్నుపోటు దినం కూటమి ప్రభుత్వంలో గుబులు పుట్టించాలని తెలిపారు. ఇచ్చిన హామిలు నెరవేర్చకపోతే ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నుంచి ఎలాంటి నిరశన ఉంటుందో తెలియచెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన పార్టీలకు, నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోట్లుతో భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. ఇచ్చిన హామిలు నెరవేర్చే దమ్మున్న నేత వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీ రాంజీ, వాలంటరీ విభాగం జాయంట్ సెక్రటరీ తోట అయ్యన్న, పబ్లిసిటీ విభాగం జాయింట్ సెక్రటరీ రామకుర్తి జగాల్, పలువురు నేతలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

శాఖపరమైన చర్యలు తప్పవు

తొండంగి: మండలంలోని రెవెన్యూ అధికారులు అందించే సేవలు మరింత మెరుగుపరచుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదులపై పరిశీలన చేశారు. ఒంటి మామిడిలో భూ వివాదానికి సంబంధించి ఫిర్యాదుపై స్వయంగా ఆమె వెళ్లి పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల రిజిస్టర్, వాటి పరిష్కారం, కృష్ణాపురం, బెండపూడిలో నిర్వహిస్తున్న రీసర్వే, పన్నుల వసూళ్ల తదితర అంశాలపై సమీక్షించారు. అధికారులు సేవలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముఖర్జీ, ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఒంటిమామిడిలో సమస్యాత్మక భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

టీబీపై అవగాహన ఉండాలి

గోకవరం: టీబీ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ తిరణ్ అన్నారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో సోమవారం ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచ్ అల్లాడ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరన్ పాల్గొని మాట్లాడుతూ టీబీ అంతానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. గ్రామాల్లో డయాబెటిక్, పొగాకు ఉత్పత్తుల వాడే వారికి, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, 60 సంవత్సరాలు పైబడిన వారికి, పాత కేసులవారికి కళ్లె పరీక్షలు, ఎక్స్‌రేలు తీసి వ్యాధి నిర్ధారణకు చర్యలు చేపట్టామన్నారు. దగ్గు, టీబీకి సంబంధించిన లక్షణాలతో బాధపడుతున్న వారు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం వ్యాధి నివారణకు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎస్‌టిఎస్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్ పి.రమ్య, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, అప్పారావు, సూర్యకుమారి, ఆశాలు పాల్గొన్నారు.



టీబీ వ్యాధి నివారణకు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

పాఠశాలల్లో చేర్పించాలి

తొండంగి: బడిబయట చదువు లేకుండా ఉంటున్న దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించేందుకు మరింత కృషి చేయాలని సమగ్రశిక్ష స్టేట్ ఐఈఆర్టీ కన్సల్టెంట్ వై.నరసింహరావు అన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బడి ఈడు దివ్యాంగ పిల్లలను బడులు చేర్పించడం ద్వారా అందే ప్రయోజనాలు తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. సదరం సర్టిఫికెట్ల మంజూరు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని వాలంటీర్లను ఆదేశించారు. సర్వే పూర్తిస్థాయిలో నిర్వహించి పిల్లల సంఖ్యను పెంచేందుకు బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ వాలంటీర్లు జగన్నాధం, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వీడిన మిస్టరీ



ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరరావు (ఫైల్)

తుని: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసును తుని జీఆర్పీ పోలీసులు చేధించారు. ఆదివారం రావికంపాడు–పిఠాపురం రైల్వే స్టేషన్ల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు దర్యాప్తులో మృతికి గల కారణం వెలుగులోకి వచ్చింది. పిఠాపురం మాధవపట్నంకు చెందిన అమలకంటి ఈశ్వరరావు (31) కాకినాడ పోర్టులో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తల్లి, తండ్రితో పాటు అన్నయ్య ఉన్నాడని, మృతుడుకి వివాహం కాలేదన్నారు. అప్పులు చేయడంతో సంబంధిత వ్యక్తులు ఇంటికి వచ్చి దౌర్జన్యం చేశారని, దింతో మనస్థాపానికి గురై రాజమండ్రి వైపు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శవ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు.

అల్లాడిన సత్యదేవుని భక్తులు



పశ్చిమ రాజగోపురం సమీపంలోని చలువ పందిరి కింద భక్తుల అవస్థలు

అన్నవరం: భానుడి ప్రతాపానికి రత్నగిరి సోమవారం అగ్నిగుండంగా మారింది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడటంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. అయితే గత రెండు రోజులుగా మరలా భానుడు తన ప్రతాపం చూపించడంతో రత్నగిరి సత్యదేవుని ఆలయానికి విచ్చేస్తున్న భక్తులు వేసవి తీవ్రతకు అల్లాడిపోతున్నారు. సత్యదేవుని ఆలయానికి సోమవారం సుమారు 25 వేలకు పైగా భక్తులు విచ్చేశారు. సోమవారం 40° డిగ్రీలకు పైబడి ఎండ కాయడంతో భక్తులు అల్లాడిపోయారు. పశ్చిమ రాజగోపురం వద్ద వాహనాల పార్కింగ్ స్థలంలో చలువ పందిరి చిన్నదిగా ఉండటంతో సరిపోక చెట్లను ఆశ్రయించారు.

ధాన్యం సొమ్ములతో పరారీ..!

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం జువ్వల రామాలయం వద్ద సోమవారం ధాన్యం రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 26 మంది రైతుల వద్ద నుంచి రూ.29 లక్షలు విలువ చేసే 29 వందల బస్తాల ధాన్యాన్ని నక్కంటి శ్రావణ్‌కుమార్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. మూడు నెలలు గడుస్తున్న తమకు చెల్లించాల్సిన సొమ్ములను చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాడని రైతులు వాపోయారు. ధాన్యం వ్యాపారి శ్రావణ్‌కుమార్ గ్రామానికి చెందిన బావిశెట్టి వీరబాబు ఇంటి సమీపంలో అద్దెకు ఉంటున్నట్లు తెలిపారు. వీరబాబు మధ్యవర్తిత్వం కారణంగానే తాము ధాన్యాన్ని విక్రయించామని తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు తమకు న్యాయం చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధిత ధాన్యం రైతులు

సారా విక్రేతదారుడు అరెస్టు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరం గ్రామంలో నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని స్థానిక ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం మేరకు జడ్డంగి అన్నవరంలో కడవలి శ్రీనును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. అదే గ్రామంలోని శివారు ప్రాంతాల్లోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయరీకి సిద్ధం చేసిన 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు.



జె.అన్నవరం గ్రామంలో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన

జగ్గంపేట: జగ్గంపేట మండలంలోని రాజపూడి, మర్రిపాక, జగ్గంపేట ప్రాంతాలకు చెందిన రైతులతో కలిసి వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని జగ్గంపేట రైతు సేవా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ టెక్నాలజీ వినియోగం, సాయిల్ హెల్త్ కార్డులు ఆధారంగా ఎరువులు వాడకం, నానో ఎరువుల ప్రత్యేకత తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సన్నరకం వరి పండించాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఖరీఫ్ సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఉద్యానవన పంటలు, పశువులు, చేపల పెంపకం గురించి సలహాలు సూచనలు అందించారు.



డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు